
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి 5 ములుగు

శనివారం 5 అక్టోబరు 2024

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: ఎల్ఆర్ఎస్-2020లో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు చేసిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ ప్రక్రియ నిర్వహణకు నియమించిన రెవెన్యూ, గ్రామపంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4,980 మంది ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా 367 దరఖాస్తుల విచారణ పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న 4,613 దరఖాస్తుల విచారణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల్లో ఎవరైనా డాక్యుమెంట్లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనట్లయితే ప్రభుత్వం మళ్లీ మొబైల్, మీసేవ కేంద్రాల ద్వారా రిజిస్టర్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడానికి అవకాశం కల్పించిందని అన్నారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల విచారణ ప్రక్రియ నిర్వహణకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల ద్వారా 19 టీంలు ఏర్పాటు చేయడం జరిగిందని, టీంలు తక్షణమే గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణకు వచ్చిన అధికారులకు ప్రజలు డాక్యుమెంట్లు అందజేస్తే ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకోవాలని, విచారణ ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సంపత్ రావు, తహసీల్దార్ విజయభాస్కర్, ఈడీఎం దేవేందర్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

మాటలు.. మంటలు..



- ప్రత్యర్థులే లక్ష్యంగా నోరుజారుతున్న నేతలు
- తొందరపాటుతో కొందరు.. కావాలనే మరికొందరు
- కొత్తచిక్కులు తెచ్చిపెడుతున్న విమర్శలు
- 'సినీ' దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ ఆరోపణలు
- వర్గీకరణ, గుడి-బడిపై మాట జారిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వివాదం కావటంతో అలా అనలేదంటూ సర్దిచెప్పుకొనే ప్రయత్నాలు
- రేవంత్ రుణమాఫీ చేయడని.. నాలుక కరుచుకున్న మానుకోట ఎంపీ
- మహబూబాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రసంగంలో దొర్లిన బూతు పదం
- రాజీనామా చేసి గెలవాలంటూ సొంత పార్టీ ఎమ్మెల్సీ సారయ్యకి కొండా మురళి సవాల్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లీడర్లు టంగ్ స్లిప్ అవుతున్నారు. పొరపాటున మాట్లాడుతున్నారో.. మనసులో ఉన్నవే బయట పెడుతున్నారో తెలియదు కానీ రాజకీయంగా 'మంటలు' రేపుతున్నారు. ఫైర్ బ్రాండ్ నేతలుగా పేరున్న వారు సైతం నోరు జారి చిక్కుల్లో పడుతున్నారు. ఆలోచించడం మరిచి.. ఫ్రస్టేషన్‌లో మాటల తూటాలు పేలుస్తూ ఎదుటి వారిని నొప్పిస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలోనూ ట్రోల్ అవుతున్నారు. ఇటీవల వరుసగా ఓరుగల్లు నేతలు తమ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. బహిరంగ సమావేశాల మొదలు విలేకరుల సమావేశాల వరకు.. పార్టీ కార్యాలయాల నుంచి అసెంబ్లీ వరకు తమ 'అదుపులేని' మాటలతో పెద్ద పెద్ద వివాదాలకే తెరతీస్తున్నారు. ఈ లీడర్ల టంగ్ స్లిప్ కాస్తా టంగ్ వార్‌గా మారడం చర్చనీయాంశమైంది.

తీవ్ర దుమారం రేపిన 'కొండా'

వరంగల్‌కు చెందిన దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై రాజకీయ దాడి చేసే క్రమంలో సురేఖ సినిమా హీరో నాగర్జున కుటుంబంపై చేసిన వాఖ్యలు ఇటు రాజకీయ రంగాన్ని.. అటు సినీ ఇండస్ట్రీని కుదిపేశాయి. పోలీస్ కేసులు, పరువు నష్టం దాఖలు వరకు దారి తీశాయి. అయితే సురేఖ తన వాఖ్యలను వెనుక్కి తీసుకుంటు న్నట్టు ప్రకటించారు. కానీ అప్పటికే సినీ ప్రముఖులు సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టడంతో రచ్చ పెద్దదైంది. అంతకు ముందే తన మెడలో తన సోదర సమానుడైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నూలు దండ వేసిన ఫొటోను షేర్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు 'కల్యాణలక్ష్మీ ఎంత ఇచ్చారు' అని అనుచిత పోస్టులు పెట్టారని సురేఖ ఆరోపించారు. ఈ ఉదంతంపై ఆమె విలేకరుల సమావేశంలో కన్నీరు కూడా పెట్టుకున్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించిన సురేఖ.. అదే ఫ్రస్టేషన్‌లో కేటీఆర్‌పై మాటల దాడి చేస్తూ అక్కినేని కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత అనుకోకుండా మాట్లాడానని, ఆ కుటుంబం బాధ పడిందని తెలుసుకుని తానూ బాధపడ్డానని వివరణ ఇచ్చారు. అయితే అప్పటికే సోషల్ మీడియాలో అక్కినేని అభిమానులు, బీఆర్ ఎస్ నేతలు మంత్రిని టార్గెట్ చేస్తూ ట్రోల్ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది.

తూటాల్లా పేలిన నాగరాజు మాటలు..

మాజీ పోలీస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇటీవల మాట్లాడిన మాటలు ఇంకా తూటాల్లా పేలుతున్నాయి. సెప్టెంబరు 30వ తేదీన ఐనవోలులో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన వాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. 'బడి కడితే మే ధావులు పెరిగిపోతారు... గుడి కడితే బిచ్చగాళ్లు పెరిగిపోతారు' అంటూ ఆయన చేసిన వాఖ్యలతో ఓ వర్గం ప్రజలు మండిపడుతున్నారు. నాగరాజు రాజీనామా చేయాలంటూ బీజేపీ కేడర్ ఆందోళనలకు దిగుతున్నారు. నాగరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై వివరణ ఇచ్చిన నాగరాజు గుడులు కడితే బిచ్చగాళ్ల అవుతారనే పదాన్ని తాను కొందరు దొంగస్వాముల ఉద్దేశించి మాత్రమే అన్నానని తెలిపారు. తాను హిందువునని, శివుడి కంఠంలో ఉండే నాగరాజు పేరే తనకు పెట్టారని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అంతకుముందు కూడా ఓ సందర్భంలో నాగరాజు చేసిన వాఖ్యలు ఎస్సీ కులాల్లో గందరగోళానికి దారితీశాయి. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారని ఎంఆర్‌పీ ఎస్ నేతలు వారం రోజులకు పైగా ఆందోళనలు చేశారు. ఇలా వరుస ఘటనలతో ఎమ్మెల్యే నాగరాజు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

ఇలా మాట జారి.. అలా ట్రోల్ అయ్యారు

- మే 7న మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఫోను సంభాషణ లీక్ అయింది. తనకు తెలియకుండానే మేయర్‌ను పార్టీలో చేర్చుకున్నారని సురేఖ అనడం చర్చనీయాంశమైంది. మంత్రి నియోజకవర్గానికి చెందిన మేయర్‌ను మంత్రికే తెలియకుండా పార్టీలో చేర్చుకోడమేంటన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అసలు ఈఫోన్ సంభాషణను ఎవరు లీక్ చేశారనే దానిపై పార్టీలో అంతర్గత చర్చ కూడా జరిగింది.
- ఆగస్టు 13న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ సొంత పార్టీ నేత, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఓ కామెంట్ దుమారం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి, ఇంత వరకు చేయలేదని అనడంతో అక్కడున్న కాంగ్రెస్ నేతలు అవాక్కయ్యారు. అయితే నాడు రైతులకు రుణ మాఫీ చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని, రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసి చూపిస్తున్నాడని చెప్పే క్రమంలో ఎంపీ మాట దొర్లారని కాంగ్రెస్ నేతలు తరువాత సర్దిచెప్పుకోవాల్సి వచ్చింది.
- ఆగస్టు 22వ తేదీన వరంగల్ పోచమ్మ మైదాన్‌లో రోడ్డుపై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలు తొలిగించగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై ఆయన చేసిన వాఖ్యలు దూమారం రేపాయి. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవి కి రాజీనామా చేశానని, బీసీ నాయకుడనే చెప్పుకునే నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన తరు వాత కూడా పదవికి రాజీనామా చేయటం లేదని, దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి రావాలని సవాల్ విసిరారు. ఇలా సొంత పార్టీ నేతపై కొండా మురళీ చేసిన వాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఇదే అవకాశంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేసింది.
- ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడిన మాటల్లో బూతులు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. అంతేకాదు ఈ మాటలతో ఎమ్మెల్యే సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యారు. 'సాముహిక కలెక్టరేట్లు, ప్రగతిభవన్లు, సెక్రెటరియట్లు కట్టించి మేము ఆ.. చూపిస్తున్నారు అధ్యక్షా' అంటూ అసభ్యకరంగా మాట్లాడారు. అనుకోకుండా వచ్చిన పదాలే అయినప్పటికి అసెంబ్లీ సాక్షిగా నోరు జారటంతో ఆయన విపరీతంగా ట్రోల్ అయ్యారు. వీరితో మరికొందరు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కూడా పలు సందర్భాల్లో మాటలు తూలి వివాదాస్పదంగా మారారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు రవీంద్రనాయక్



ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

ములుగు, అక్టోబరు 4: ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు రవీంద్రనాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలను సందర్శించారు. జనరల్, పిల్లల వార్డులు, ఐసీయూలను పరిశీలించారు. అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను పెంచాలన్నారు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య ఆరోగ్య శాఖల నడుమ సమన్వయం ఉండాలని, అప్పుడే రోగులకు మంచి వైద్యసేవలు అందుతాయని తెలిపారు. సిబ్బంది, సదుపాయాల కొరతపై వివరాలను సేకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ బి.మోహన్‌లాల్, ఏరియా వైద్యశాల ఆర్ఎంవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్
- కాళేశ్వరంలో అభివృద్ధిపై సమీక్ష



కాళేశ్వరంలో గోదావరి ఘాట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మహదేవపూర్, అక్టోబరు 4: మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి అందరూ సహకరించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. కాళేశ్వరం, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై శుక్రవారం జరిగిన సమీక్ష నామమాత్రంగా సాగింది. ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, సమాచార కమిషనర్ హనుమంతు కాళేశ్వరంలో క్షేత్ర పర్యటన చేసిన విషయం తెలిసిందే. దేవస్థానం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరిన విషయం తెలిసిందే. కాళేశ్వరంలో శుక్రవారం అభివృద్ధిపై సమీక్షకు జిల్లా కలెక్టర్ హాజరు కావాల్సి ఉండగా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం నామమాత్రంగా జరిగింది. అనంతరం సబ్ కలెక్టర్ గోదావరి ఘాట్‌ను పరిశీలించారు. గోదావరి ఒడ్డున ఉన్న మరుగుదొడ్లను వెంటనే తీసివేయాలని, ఆ వ్యర్థాలను గోదావరి ప్రవాహంలో విడుస్తుండడంతో స్నానాలు చేసే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. టాయిలెట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే సంగమేశ్వరాలయం వద్ద ఉన్న దుర్గాంధాన్ని గ్రామస్థులు సబ్ కలెక్టర్ చూపించగా పరిశీలించి వెంటనే శుభ్రం చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వంద గదుల వసతి గృహానికి రూ.2కోట్లు కావాలని, నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తే భక్తులకు గదులు అందుబాటులోకి వస్తాయని, పంచాయతీరాజ్ శాఖ డీఈఈని ప్రతిపాదనలు పంపాలని సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆదేశించారు.

మత్స్యకారులను కోటీశ్వరులను చేస్తాం

- జిల్లాలో చేపల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ
- చేపపిల్లల పంపిణీలో మంత్రి సీతక్క



జాకారం చెరువులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: రాష్ట్రంలోని మత్స్యకారులను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లాలో సరస్సులు, చెరువులు, కుంటలు సమృద్ధిగా ఉన్నాయని, చేపల పెంపకానికి ఈప్రాంతం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. శుక్రవారం ములుగు మండలంలోని జాకారం ఊర చెరువులో ఆమె కలెక్టర్ టీఎస్.దివాకర, మత్స్యకార సహకార సంఘాల సంస్థ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌లతో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో చేపపిల్లల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ముందుకు పోతున్నారని అన్నారు. ముదిరాజ్ కులస్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చేపలను పెంచడానికి చేపపిల్లలను ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అధిక మొత్తంలో చేపల పెంపకం చేపట్టడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చేపపిల్లలను పంపిణీ చేసిందని అన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు చెరువులు, కుంటల్లో చేపలు పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేసి ఇప్పటికే చేపపిల్లలను పంపిణీ చేసిందని చెప్పారు. ఎదుగుతున్న నాయకులను ఏ తరహాలో చూస్తారో అదే తరహాలో చేపల పెంపకం చేపట్టాలని, పెరిగిన చేపలను అమ్మకం చేసి మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. చేపల వేట కోసం వెళ్లి మృత్యువాత పడిన మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగడానికి ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను కేటాయించి సభలకు పంపించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో రామకృష్ణ, మత్స్యశాఖ అధికారి అవినాష్, మత్స్య సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడుకుంటేనే జీవనాధారం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గణపురం : చెరువులను కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు జీవనాధారమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రంలో చేపపిల్లల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి నూరు శాతం రాయితీపై ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. చెరువే మన జీవనాధారమని, గత ప్రభుత్వ హయాంలో చెరువులన్నీ అన్యాక్రాంతానికి గురయ్యాయని పేర్కొన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతుంటే అడ్డుపడుతున్నారన్నారు. చెరువుల పట్టణంగా హైదరాబాద్‌కు పేరుందని, ఆ చెరువులను కాపాడుకోవాలన్నారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకారుల బలోపేతానికే ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమమని అన్నారు. గత ప్రభుత్వం చేపలు, గొర్రెల పంపిణీలో అవినీతికి పాల్పడడంతో పాటు ప్రభుత్వ భూములను సైతం అమ్ముకున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫిషరీష్ కోఆపరేటివ్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, మత్స్య సహకార సంఘాల నాయకులు రాజ్‌కుమార్, రమేష్, ఆకుల సుభాష్, సాంబయ్య, గణపతి, రాజు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



గణపురంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

విద్యుత్ ఉద్యోగుల నిరసన

రామగుండం థర్మల్ ప్రాజెక్టును జెన్‌కోకే అప్పగించాలని డిమాండ్



కేటీపీపీ ముఖద్వారం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

గణపురం, అక్టోబరు 4: రామగుండంలో చేపట్టే థర్మల్ ప్రాజెక్టును జెన్‌కోకే అప్పగించాలని మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కేటీపీపీ ప్రధాన ముఖద్వారం ఎదుట థర్మల్ ప్రాజెక్టును జెన్‌కోకే అప్పగించాలని నినాదాలు చేశారు. నిర్మించబోయే 800 యూనిట్ల ప్రాజెక్టులో సింగరేణితో భాగస్వామ్యాన్ని ఒప్పుకోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేటీపీపీ అన్ని విద్యుత్ ఇంజనీర్ల యూనియన్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి


సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి

వివరాలు 8వ పేజీలో

మొనగాడు కాదు.. మోసగాడు

- రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
- ఆరు గ్యారంటీలనూ సక్రమంగా అమలు చేయలేకపోయాడు
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా
- ఎడ్లబండిపై నిరసన ర్యాలీ

7లో...



తొర్రూరులో జరిగిన రైతుధర్నాలో మాట్లాడుతున్న హరీష్ రావు, చిత్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మధుసూదనాచారి, కవిత తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం, క్రమశిక్షణ

- సీఐ బండారి కుమార్

వెంకటాపురం(నూగూరు), అక్టోబరు 4: క్రీడలతో మానసికోల్లాసం కలగడంతో పాలు క్రమశిక్షణ అలవడుతుందని సీఐ బండారి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కాఫెడ్ క్రీడా మైదానంలో శుక్రవారం వెంకటాపురం ప్రీమి యం లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు వ్యక్తిలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. స్ఫూర్తితో ఆటలాడాలని, యువత చెడు మార్గం పట్టకుండా క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.15వేలను నిర్వాహకులు అందజేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుడవర్తి నర్సింహమూర్తి, మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకుడు ముదుంబ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ కుమార్

వచ్చే నెల 4 నుంచి
ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 4: కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం తెలిపారు. నవంబరు 4న శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ మొదటి పేపర్-1, అలాగే నవంబరు 8న ఎలక్టివ్ పేపర్-2లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఎడ్యుకేషన్ విభాగాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, అక్టోబరు 4: కాజీపేట- దాదర్, దాదర్ - కాజీపేటల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడపునున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. 07195 కాజీపేట - దాదర్ అక్టోబరు 16, 23, నవంబర్ 13, 20, 27 తేదీల్లో కాజీపేట నుంచి ప్రతీ బుధవారం 15.00 గంటలకు బయలు దేరి గురువారం 13.25 నిమిషాలకు చేరుకుంటుంది. 07196 దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 17, 24, నవంబర్ 14, 21, 28, తేదీల్లో దాదర్‌లో ప్రతీ గురువారం 15.25 నిమిషాలకు బయలుదేరి శుక్రవారం 16 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 07197 కాజీపేట-దాదర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో అక్టోబరు 12, 19, 26 నవంబర్ 2, 11, 16, 23, 30 ప్రతీ శనివారం 11.30నిమిషాలకు బయలుదేరి ఆదివారం 13.25కు చేరుకుంటుంది. (07198) దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 13, 20, 27 నవంబరు 3, 10, 24, 27 డిసెంబరు 1వ తేదీన దాదర్‌లో ప్రతీ ఆదివారం 15.25నిమిషాలకు బయలుదేరి సోమవా రం కాజీపేటకు 21.30 నిమి షాలకు చేరుకుంటుంది. ఈ రైలుకు జమ్మికుంట, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, బందర్, వాని, కయర్, లింగ్‌టీ, పింపల్కుహంటి, ఆదిలాబాద్, కిన్‌వేట్, సమస్రఖండ్, హిమయత్‌నగర్, బోకర్, మెద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్భానీ, పెలు, పర్దున్, జల్నా, ఔరంగబాద్, లానూర్, రోటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్‌టాపూరి, కళ్యాన్, రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చారు.

కొనసాగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు 1:3 మెరిట్ ప్రాతిపదికన వెరిఫికేషన్ కొనసాగుతోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారంతో రెండోరోజుకు చేరుకుంది. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, శనివారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగియనుంది.

ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడం అన్యాయం

న్యూశాయంపేట, అక్టోబర్4: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం అన్యాయమని, ఇది మాదిగలకు ద్రోహం చేయడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం న్యూశాయంపేటలో ఏర్పాటుచేసిన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో నరేష్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు. ఈ నిరసనకు ఎంఆర్‌పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

మానుకోట కాంగ్రెస్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

- వారం కిందట గుండెపోటు.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- నేడు పురుషోత్తమాయగూడెంలో అంత్యక్రియలు



మరిపెడ, అక్టోబరు 4: కాంగ్రెస్ సీనియర్ నేత, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నూకల నరేశ్‌రెడ్డి(74) శుక్రవారం కన్నుమూశారు. వారం రోజుల కిందట ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో అభిమానులు శోకసముద్రంలో మునిగిపోయారు. వారం కిందట హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు వైద్యులు స్టెంట్ వేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు, మాజీ మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆస్పత్రికి వెళ్లి నరేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అయితే నరేశ్‌రెడ్డికి డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. నూకల నరేశ్‌రెడ్డి జీవితం ఓ తెరిచిన పుస్తకం. మేనమామ రామసహాయం సురేందర్‌రెడ్డి ద్వారా రాజకీయ వారసత్వం అందుకున్న ఆయన నాటి నుంచి నేటి వరకు కాలం తో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రాజకీయంగా అనేక పదవులు అందనట్టే అంది చేజారిపోయాయి. అయినా ఎన్నడూ నిరాశ చెందని ఆయనకు ఎలాంటి పరిస్థితుల్లో అయినా తనను నమ్మినోళ్లకు అండగా ఉన్నారన్న పేరుంది. నరేశ్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకురానుండగా.. శనివారం పురుషోత్తమయాగూడెంలోని వ్యవసాయ క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంత్యక్రియలకు భారీగా జనం తరలొచ్చే అవకాశం ఉండటంతో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. నరేశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం రాత్రి పరిశీలించారు.

రాజకీయ ప్రస్థానమిలా..

1989 అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ బీఫామ్ ఆయనకే ఖరారైనా కొందరి మోసపూరిత మాటలకు బలియై పోటీకి దూరమయ్యారు. 1994లో డోర్నకల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో టీడీపీలో చేరిన ఆయన 1999ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో రెడ్యానాయక్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్మన్ పదవిని ఆశించిన నరేశ్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేయూతతో రాయపర్తి జడ్పీటీసీగా గెలిచారు. జడ్పీ చైర్మన్ కోసం గట్టిపోటీ ఇచ్చారు. 2012లో తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాతి పరిణామాల్లో 2024లో మళ్లీ సొంతగూడైన కాంగ్రెస్‌లో చేరి.. ఎంపీ బలరాంనాయక్ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. అంతేకాదు ఆయనకు ఖమ్మం జిల్లాతోనూ ఎంతో రాజకీయ అనుబంధం ఉంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నరేశ్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున ఆ జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేశారు. పాలేరు ఉపఎన్నికల్లో తుమ్మల గెలుపులో తనవంతు పాత్ర పోషించారు. 2018 ఎన్నికల్లోనూ మరోసారి ఇన్‌చార్జిగా పనిచేశారు. 2020ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపునకు కృషి చేశారు.

ఆటోడ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



ఆటోడ్రైవర్స్‌కు లైసెన్సును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, అక్టోబర్ 4: డ్రైవింగ్ లైసెన్స్ లేని 35 మంది డ్రైవర్లకు సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. కొద్ది రోజుల కిందట ట్రైసిటీ పరిధిలోని ఆటోడ్రైవర్స్‌కు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్స్‌కు తాను చొరవ తీసుకొని లైసెన్స్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంగా డ్రైవర్స్‌నుంచి కావాల్సిన దస్త్రాలను తీసుకొని లైసెన్స్‌లను మంజూరు చేశారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సమక్షంలో ఆయా డ్రైవర్స్‌కు సీపీ లైసెన్స్‌లను అందజేశారు. రానున్న రోజుల్లో హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రైవర్లకు సైతం లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. కాజీపేటలో లైసెన్స్‌లు ఇప్పించడానికి కృషిచేసిన సీఐ నాగబాబు, ఎస్సై ఉమాకాంత్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

బీజేపీ డ్రామాలకు రైతులు మోసపోవద్దు

- రుణమాఫీపై ధర్నాలు చేయడానికి ఆ పార్టీ నాయకులకు సిగ్గుండాలి
- మూసీ నది ప్రక్షాళనలో ప్రతిపక్షాల తీరు సిగ్గుచేటు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: రైతులకు ఏనాడూ రుణమాఫీ చేయని బీజేపీ వాళ్లు ఇప్పుడు రుణమాఫీ విషయంలో ధర్నాల పేరుతో డ్రామాలు చేస్తున్నారని, ఆ డ్రామాలను నమ్మి రైతులు మోసపోవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికే 23లక్షల మందికి రుణమాఫీ వర్తింపజేశామని, దాదాపు రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యా యన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విధానాల ప్రకారం 42లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయబోతున్నామని అందుకుగాను రూ.31వేల కోట్ల ఖర్చు చేయబోతున్నామని వివరించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని, రైతులు ప్రతిపక్షాల మాటాలు పట్టించుకోవద్దన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా కూడ ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణమాఫీ చేసిన చరిత్ర లేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతుల రుణమాఫీ ఏనాడు చేయలేదని, కనీసం రుణమాఫీ చేస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక చేయూత కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రైతులకు ఏమీ చేయని బీజేపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని, వారికి రైతులపై ప్రేమ ఉంటే కేంద్రాన్ని ఒప్పించి దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ ప్రకటించాలన్నారు. రాష్ట బీజేపీ నాయకులు నరేంద్రమోదీని ప్రశ్నించే ధైర్యం లేదని బీజేపీ అంటేనే రైతు, దళిత, తెలంగాణ వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన విషయమై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నాయని, మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలు సుమారు 1000 మంది స్వచ్ఛందంగా వెళ్లిపోగా వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, దీనిపై సీఎం ఓ స్పష్టమైన విధానంతో ఉన్నారన్నారు. కానీ స్వచ్ఛందంగా వెళ్లిపోయే వారిని వెళ్లిపోకుండా మీరు ఈ మురికిలోనే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అన్నారు. పేదల ఓట్లతోనే గెలిచిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. పేదలను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేయదన్నారు. కార్యక్రమంలో నాయకులు జెలిది వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, గడ్డమీది సురేష్, అన్నం బ్రహ్మారెడ్డి, డాక్టర్ అంబటి కిషన్‌రాజ్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, ఎడ్ల వెంకటస్వామి, బత్తిని అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొనగాడు కాదు.. మోసగాడు..

- రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
- సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా



తొర్రూరు సభా వేదికలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడని, అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానంటూ తొలి సంతకం చేసి రైతులను మోసగించాడని బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు, నేతలు ఎడ్లబండిపై నిరసన ర్యాలీ నిర్వహించి.. అనంతరం విశ్రాంతి భవనం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత హరీశ్‌రావు మాట్లాడారు. అన్నదాతలకు కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మోసం చేశారని, రుణమాఫీ చేసేవరకు కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 30 శాతం కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రుణమాఫీ, రైతు భరో సా, రైతుబంధు, పంటలకు బోనస్, అర్హులైన మహిళలకు రూ.2500 భృతి, పెన్షన్‌లు పెంపు లాంటి హామీలను అమలుపర్చకుండా మోసం చేస్తున్నారని, ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. ఆగ స్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మొదట రూ.49 వేల కోట్లు, ఆ తర్వాత రూ.31 వేల కోట్లు చివరకు మాఫీ చేసింది రూ.17వేల కోట్లు మాత్రమే అన్నారు. తొర్రూరు మండలంలో 11 వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే 5 వేల మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని యాదాద్రి, భద్రాద్రి, కొమురెల్లి, సమ్మక్క-సారలమ్మలపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు వేసి, మాఫీ చేస్తానని మోసం చేశాడని అన్నారు. రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, బ్రోకర్ మాటలు చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి రైతులను మోసగిస్తున్న ఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కూల్చుడు తప్ప కట్టుడు తెలువదన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో కష్టపడి సంపాదించుకున్న ఇండ్లను కూలగొడుతున్నారని, మూసీ శుద్ధిపేరుతో మరో కుంభకోణానికి తెర లేపారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

తొర్రూరులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రైతు ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. వారిని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ రుణం ఎంత ఉంది. భూమి ఎన్నిఎకరాలు ఉంది రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెపుతున్నారు లాంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాకుండా రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని, రైతుల గోడు పట్టించుకోవాలన్నారు. దసరా వరకు రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పంట కోతకు వచ్చిందని, రైతుబంధు, రైతు భరోసా పడలేదని కేసీఆర్ ఉన్నపుడు రైతుబంధు వచ్చేదని రైతులు తమ గోడును వారికి వెల్లగక్కారు. ఏది ఏమైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టాలని, అప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనకు హాజరైన రైతులు, కార్యకర్తలు

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల ఇద్దరి అరెస్ట్, చోరీ సొత్తు వివరాలు చెబుతున్న రైల్వే సీఐలు

గిర్మాజీపేట, అక్టోబరు 4: సింహపూరి ఎక్స్ ప్రెస్‌లో చోరీకి పాల్పడిన గొడుగు నవీన్ (21), గుగులోతు నరేష్(25)లను శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీ నం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. వరంగల్ జీఆర్‌పీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మాట్లాడారు. గతనెల 13న గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సింహపూరి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలు నిద్రలో ఉండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీలో ఫిర్యాదు చేసింది. దీంతో గత నెల 26న వరంగల్ జీఆర్‌పీ బదిలీ అయిందన్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో భాగంగా జీఆర్‌పీ సిబ్బంది శుక్రవా రం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల తనిఖీ చేపట్టామన్నారు. ప్లాట్ ఫాం2, ప్లాట్‌ఫాం3 ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీచేయగా వారి వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో గొడుగు నవీన్ (గార్ల- మహబూబాబాద్ జిల్లా), గుగులోతు నరేష్ (రాజుల పాలెం -ఖమ్మం జిల్లా) నెల 13న సికింద్రాబాద్ వెళ్తున్న సింహపూరిలో ప్రయాణికురాలికి చెందిన బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు వారు అంగీకరించారని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుల నుంచి రూ.3.50లక్షల విలువైన బంగారు నెక్లెస్, రెండు బంగారు గాజులు, ఒక వెండి గ్లాస్, రెండు వెండి కుంకుమ భరిణెలు స్వాధీనం చేసుకుని కాజీపేట రైల్వేకోర్టు ద్వారా రిమాండ్ చేసినట్లు సీఐ తెలి పారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ టి.ఎస్.ఆర్. కృష్ణ, జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దిన్ పాల్గొన్నారు.





375 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

ములుగు, అక్టోబరు 4: డీఎస్సీ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన కొనసాగుతోందని, 4వ తేదీ నాటికి 375 మంది సర్టిఫికెట్లను పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 192 ఉపాధ్యాయ పోస్టులకు గాను 576 మంది అర్హత పొందారని వెల్లడించారు. 1:3 నిష్పత్తిలో పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ములుగులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల్లో కౌంటర్లు ఏర్పాటు చేశామని, మిగిలిన అభ్యర్థులు ఈనెల 5 సాయంత్రంలోగా ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సెక్యూరిటీ గార్డులకు ఉద్యోగోన్నతులు

కాకతీయఖని, అక్టోబరు 4: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న 21 మంది ఎస్ అండ్ పీసీ (సర్వీస్ అండ్ ప్రొటెక్షన్ కాప్స్) గార్డులకు యాజమాన్యం సీనియర్ సెక్యూరిటీ గార్డులుగా పదోన్నతులు కల్పించింది. వీరికి ఏరియా సెక్యూరిటీ అధికారి టి.రవి ప్రమోషన్ పత్రాలను అందజేశారు. భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ లింగయ్య, జమేదార్ బుచ్చయ్య, గార్డులు దేవేందర్,శరత్, నవీన్,బాబు,గంగారాం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : సీఐ

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీఐ శంకర్ అన్నారు. ములుగు మండలంలోని బరిగలోనిపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ జరగగా సీఐ పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు రావొచ్చని, మధ్యవర్తులను తీసుకొని రావొద్దని అన్నారు. అన్ని శాఖల సమన్వయంతో గ్రామాల్లో నేరాలను నిరోధించేందుకు పోలీసు శాఖ పాటుపడుతుందని తెలిపారు. పౌరుల్లో నేర ప్రవృత్తిని తగ్గించేందుకు గ్రామస్థులు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్


14వ వార్డులో డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 4: భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. మునిసిపాలిటీ పరిధిలోని 14, 17, 29, 23, 25 వార్డులలోని జంగేడు, సుభాష్‌కాలనీ, రాజీవ్‌నగర్, కారల్‌మార్క్స్ కాలనీలలో టీయూఎఫ్ఐడీసీ ఫేజ్-4 కింద మంజూరైన రూ.1.39కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తున్నట్లు తెలిపారు. గుత్తేదారు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, దాట్ల శ్రీనివాస్, మురళీధర్, శిరుప అనిల్, పిల్లలమర్రి నారాయణ, బుర్ర కొంరయ్య, పిప్పాల రాజేందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

డీపీవోను పరామర్శించిన మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: ములుగు డీపీవోగా పనిచేస్తున్న ఒంటేరు దేవరాజ్ తండ్రి సారయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం పరామర్శించారు. అంతకుముందు ఆమె సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా రవీందర్

చిట్యాల, అక్టోబరు 4: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అల్లం రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి నియామక పత్రాన్ని అందించినట్లు రవీందర్ పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు దక్కుతాయని, తన నియామకానికి సహకరించిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

ఛత్రపతి శివాజీ, బీజేపీ గద్దెల ధ్వంసం

▸▸ ఘటనపై జాతీయ రహదారిపై బీజేపీ నేతల ధర్నా


ఏటూరునాగారంలో రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు


గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన బీజేపీ గద్దె

ఏటూరునాగారం, అక్టోబరు 4: మండల కేంద్రంలోని వై-జంక్షన్ ప్రాంతంలో బీజేపీ, చత్రపతి శివాజీ జెండా గద్దెల కూల్చివేతకు నిరసనగా శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరయ్యారు. తొలుత వై-జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు బీజేపీ, చత్రపతి శివాజీ జెండాలను చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై పార్టీ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ.. కొందరు ఉద్దేశపూర్వకంగా వాటిని ధ్వంసం చేశారని ఆరోపించారు. పదవుల్లో ఉన్న వ్యక్తులే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, ఇందులో అధికార పార్టీ నేతల హస్తం ఉందని విమర్శించారు. ఆనాడు శివాజీ లేకుంటే హిందూ సమాజమే ఉండేదికాదని స్పష్టం చేశారు. యావత్ హిందూ సమాజం గర్వించగ్గ మహనీయుడు శివాజీ అని, ఆయన చరిత్రను యువత తెలుసుకోవాలన్నారు. అనంతరం బీజేపీ గద్దె, చత్రపతి శివాజీ మహారాజుల గద్దెలకు శంకుస్థాపన చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ అనుముల శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని గద్దెలను కూల్చివేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పార్టీ నాయకులు ఆందోళన విరమించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకొని దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లడే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సత్యం, జిల్లా కార్యదర్శి ఇంకోల్లు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జన స్థలాలు శుభ్రం

కాటారం, అక్టోబరు 4: మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో బతుకమ్మ నిమజ్జన స్థలాల శుభ్రత, వీధి దీపాలను ఏర్పాటు చేసే ప్రక్రియ శుక్రవారం సాగింది. పంచాయతీ కార్యదర్శులు తమపై బాధ్యత వేసుకుని బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గారెపల్లి చింతల చెరువు వద్ద బతుకమ్మ ఆట, నిమజ్జనం కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాక్టర్‌తో పనులు చేశారు. ధన్వాడ, గంగారం తదితర జీపీల్లో వీధిదీపాల బిగింపు, డ్రై డే కార్యక్రమాలు, చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో జీపీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, శ్రీనివాస్, కృష్ణవేణి, నాగరాజు, రాకేష్, జ్యోత్స్న, గంగాధరన్, శివ, శంకర్, సునిత, నవ్య ప్రసన్న, రాజశేఖర్, సురేష్, సాయికృష్ణ, లక్ష్మి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తుల గడువు పెంపు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: రెగ్యులర్ పాఠశాల విద్య అవకాశం లేని విద్యార్థులు, గృహిణులు, నిరుద్యోగులు ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు పీవీ శ్రీహరి ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ములుగులోని బాలుర ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ క్యాతం రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో అడ్మిషన్ కోసం పుట్టిన తేది, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్‌కార్డు, ఒక పాస్‌పోర్ట్‌సైజు ఫొటో, ఇంటర్‌లో సీఈసీ, హెచ్‌ఈసీలో ప్రవేశం కోసం పదో తరగతి మార్కుల మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో అభ్యర్థులు ములుగులోని దూరవిద్య విధాన అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శిరుప సతీష్‌కుమార్(9948427050)ను సంప్రదించాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ క్యాతం రాజేందర్ సూచించారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి : ఎమ్మార్పీఎస్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 4: ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేశాకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి దోర్నాల రాజేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా చంద్రమౌళి హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుకు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేస్తామని నమ్మబలికిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండలేక ఎందుకు హడావిడిగా నియామకాలు చేస్తున్నారని ప్రశ్నించారు. మాదిగలను నమ్మించడానికి ముందొక మాట చెప్పి, ఇప్పుడు మాలలను ఎందుకు ప్రోత్సహించినట్లు చేస్తున్నారని నిలదీశారు. డీఎస్సీ నియామకాలతో పాటు ఇతర ఉద్యోగాల భర్తీని తాత్కాలికంగా వాయిదా వేసి వర్గీకరణ అమలు చేశాకే ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే ఈనెల 9న అన్ని జిల్లాల్లో, మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. అలాగే 15వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ మండలాల ఇన్‌చార్జ్‌లు అంతడుపుల సురేష్, అశోక్, మంద కిరణ్, తిరుపతి, సుమన్, భిక్షపతి, రవి, శ్రీనివాస్, రాంచందర్, శంకర్, లచ్చయ్య, చిరంజీవి, రాజయ్య, మనోహర్, నరేష్, దుర్గయ్య, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

▸▸ దర్శించుకున్న మంత్రి సీతక్క


ములుగులో దుర్గామాతను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 4: దుర్గా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ములుగులోని రామాలయం ఆవరణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలు వైన దుర్గామాత అమ్మవారు రెండో రోజు శుక్రవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కుమార్తె అన్విత జన్మదినం సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ చేపట్టగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు బండారి మోహన్‌కుమార్, అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, సభ్యులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, రాప్‌రెడ్డి, కొత్త సురేందర్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, ఇమ్మడి రాకేష్, గట్ల శ్రీనివాసరెడ్డి, ఆవుల ప్రశాంత్‌రెడ్డి, అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి, పల్లె జయపాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులుపాల్గొన్నారు.

బ్రహ్మచారిణి అలంకరణలో అమ్మవారు

మహదేవపూర్: మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ అర్చకులు అమ్మవార్లకు పూర్ణాభిషేకం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, దీక్షా వస్త్రధారణ, రక్షాబంధనం, మూలమంత్ర చండీ హోమం నిర్వహించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి : సీపీఎం


మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

తాడ్వాయి, అక్టోబరు 4: మండలంలోని లింగాల గ్రామంలో పోడు భూములకు పట్టాలు అందించడంతోపాటు పెండ్లివాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పునరుద్ధరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంతో గ్రామంలోని కొంత మంది పేదలకు పోడు పట్టాలు వచ్చాయని, మరి కొందరికి రాలేదని, వారందరికీ హక్కు పత్రాలు అందించాలన్నారు. అదేవిధంగా 2003లో గ్రామంలోని పెండ్లివాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించారని, ఆ పనులు పూర్తికాకుండానే మధ్యలో నిలిపి వేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ చూపి పెండ్లివాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పునరుద్ధరించి భూములకు సాగునీరు అందించాలని కోరారు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, కొడిశాల-లింగాల మధ్యలో నిలిపివేసిన బీటీరోడ్డు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శిగా కోరం రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి, నాయకులు ఊకె ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, జన్ను ఎల్లయ్య పెనుక కాంతారావు, సమ్మక్క, సుధాకర్, పాయం నారాయణ, తోలెం చంద్రయ్య, కోరం సారయ్య ఉపేంద్ర, పూనెం అబ్బయ్య, చంద్రకళ, పెంటమ్మ, సునీత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని నిర్మూలించాలి : డీఎస్పీ

గణపురం, అక్టోబరు 4: గంజాయిని నిర్మూలించేందుకు కష్టపడి పనిచేయాలని డీఎస్పీ సంపత్‌రావు పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, డయల్ 100, వర్టికల్స్ పనితీరు, కోర్టు ప్రాసెసింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్హర్, అక్టోబరు 4: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు. తాడిచర్ల మానేరు నుంచి అక్రమంగా ఇసుకను భూపాలపల్లి పట్టణానికి తరలిస్తున్న భూపాలపల్లి, కాశీంపల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లను కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతంలో పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓబీసీ మోర్చా నేతకు కేంద్ర మంత్రి సంజయ్ సన్మానం

కాటారం, అక్టోబరు 4: మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల రాజేంద్రప్రసాద్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం సత్కరించారు. ఓబీసీ మోర్చా పదవిలో బాధ్యతలు చేపట్టిన అనంతరం రాజేంద్రప్రసాద్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలవగా శాలువాతో సన్మానించారు. ఓబీసీల అభ్యున్నతి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి సూచించగా తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయనకు హామీ ఇచ్చినట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మలతో జిల్లా జడ్జి సూర్యచంద్రకళ, జడ్జిలు

ములుగు, అక్టోబరు 4: ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ బతుకమ్మ వేడుకలను ప్రారంభించగాసీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది ఆడిపాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ సునీల్‌కుమార్, పీపీ శ్యాంప్రసాద్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

మల్హర్, అక్టోబరు 4: మండల కేంద్రమైన తాడిచర్లలోని ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో మధుసూదన్ తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతపాటించే విధంగా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కొంరయ్య ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ప్రమోద్, డీపీవో ఎన్‌హెచ్‌ఎం చిరంజీవి, డీడీఎం మధుబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రేగొండ, అక్టోబరు 4: మినీవ్యాన్ స్కూటీని ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం... ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన జనగాం రాజు పరకాల వైపు భార్యతో కలిసి స్కూటీపై వెళ్తున్నాడు. కాగా, అదే వైపు వెళ్తున్న మినీవ్యాన్ స్కూటీని వెనక నుంచి ఢీకొనడంతో రాజు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి వెళ్లిన పీఎస్సై దివ్య గాయాలైన వ్యక్తిని ఆటోలో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తరఫున ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోవిందరావుపేట, అక్టోబరు 4: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ప్రిసైడింగ్ ఆఫీసర్, ఏపీడీ వెంకటనారాయణలు పాల్గొని 01-04-2023 నుంచి 31-03-2024 వరకు మండలంలోని గ్రామాల్లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, ఖర్చుల వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్లు సాంబయ్య, కిష్టయ్య, ఏపీవో ప్రసూన, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ కొమురయ్య, మండల ఈసీ మనోహర్, టెక్నికల్ అసిస్టెంట్లు రామయ్య అరుణాకర్, అశోక్, కుమార్, బీఎఫ్‌టీ శ్రీపాల, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్, సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు, కూలీలు పాల్గొన్నారు.

సీఐ వాహనం, బైక్ ఢీ

పలువురికి గాయాలు

చిట్యాల, అక్టోబరు 4: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ మూలమలుపు వద్ద చిట్యాల సీఐ వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లికి చెందిన పుప్పాల నర్సయ్య, విజయ దంపతులకు తీవ్ర గాయాలు కాగా, సీఐ మల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... పోలీస్‌స్టేషన్ నుంచి సీఐ వాహనంతో రామచంద్రాపురం వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో నర్సయ్య దంపతులు పరకాల నుంచి స్వగ్రామమైన గర్మిళ్లపల్లికి వెళ్తున్నారు. నాలుగు రహదారుల మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. సీఐ వాహనం ముందు అద్దం పగిలి స్వల్ప గాయాలు కాగా, నర్సయ్య దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను తన వాహనంలో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హనంకొండకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాటారం, అక్టోబరు 4: సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక సూచించారు. మండల వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు, పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఫీవర్ సర్వే చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే డెంగీ, చికున్ గున్యా, కలరా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, వాటిని నివారించడానికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక్, హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, హెచ్‌ఏ సమ్మ య్య, ఏఎన్‌ఎంలు నాగరాణి, సునిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైన్స్, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్

కాటారం, అక్టోబరు 4: మండలంలో నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిలో మద్యం విక్రయాలు చేస్తున్న వైన్స్, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కాటారం మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ వైన్ షాపులు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో పార్కింగ్ స్థలం లేక వందలాది వాహనాలు రోడ్డు పక్కనే నిలపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. బెల్ట్ షాపులకు మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతూ సరైన బ్రాండ్లు షాపుల్లో ఉంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం తాగి మత్తులో యువత డ్రగ్స్, గంజాయికి అలవాటై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు బొడ్డు స్మరణ్, మల్లేశ్వరి, తిరుపతి, గణేశ్వరి, బొడ్డు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల పంపిణీ

రేగొండ, అక్టోబరు 4: మండలంలోని చెంచుపల్లి గ్రామానికి చెందిన దుర్గారావు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, ఆ కుటుంబానికి పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు శుక్రవారం నిత్యావసర సరుకులు అందచేశారు. అతని భార్య నిండు గర్భిణీ కాగా వారి పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని క్వింటా బియ్యం, సరుకులు ఇచ్చినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సహకారంతో సహాయం చేసినట్లు పేర్కొన్నారు. సీహెచ్‌వో లింగారెడ్డి, వైద్యులు విష్ణువర్ధన్, రూబెన్, చందన, రమ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడి మృతి

చిట్యాల, అక్టోబరు 4: మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బుర్ర మహేష్(50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, చెక్క నర్సయ్య, గజనాల రవీందర్, మైదం శ్రీకాంత్, ప్రభాకర్, బుర్ర తిరుపతి ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేస్తే సహించం

కాటారం, అక్టోబరు 4: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభివృద్ధిని మరిచారని బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రవీందర్‌రావు, దామెరకుంట మాజీ సర్పంచ్ బాసాని రఘువీర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు నెలలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ ధర్నా చేస్తే పోలీసులు కేసు నమోదు చేస్తే బీజేపీ నేత చల్ల నారాయణరెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు కేసు పెట్టించారనడం హాస్యాస్పదమన్నారు. మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుండగా వాటి ఫలితాలు కళ్ల ముందు కనబడుతుంటే కొందరికి కళ్లు కనిపించడం లేదని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో పనిచేసిన నారాయణరెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరి చేసిందేమిటో చెప్పాలని నిలదీశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భూపెల్లి రాజు, చీటూరి మహేష్, ఎనగంటి తిరుపతి, గట్టయ్య, కుమార్, రాజశ్రీను పాల్గొన్నారు.